క్లుప్తంగా

ఆకట్టుకున్న కోలాటం..



భగవాన్ సత్యసాయి బాబా 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక సాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మహిళల కోలాటం అలరించింది. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ ఆర్.కిశోర్, తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

వేతనాలు చెల్లించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి తక్షణమే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శానిటేషన్ కార్మికులకు అందిస్తున్న రూ.6 వేల వేతనం కూడా నెలల తరబడి చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం ఎంఈఓ కృష్ణమూర్తినాయుడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు బి. చిన్నమ్మడు, బి. గౌరీ, పి. జ్యోతి, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.
– పాలకొండ

శతశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

గరుగుబిల్లి: పంచాయతీల్లో శతశాతం ఇంటి పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా గురువారం సందర్శించి పలు రికార్డులను, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కార్యదర్శికి ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల పనితీరును ఆమె పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. బోగస్ హాజరు వేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, కార్యదర్శి అప్పారావు, ఉపాధ్యాయులు బి.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యం : డీపీఓ

జియ్యమ్మవలస: స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో స్వచ్ఛ సుందర పార్వతీపురంపై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాను స్వచ్ఛ సుందర జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుని, వ్యర్థాలను తొలగించి తడి, పొడి చెత్తను వేరుచేసి సకాలంలో వ్యర్థాలను సేంద్రియ అకర్బన భాగాలుగా విభజించడం వల్ల పార్వతీపురంలో చెత్త సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు. జిల్లాలోని ప్రతి పంచాయతీ ఆదర్శవంతంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీ పాలకమండలి సభ్యుల వివరాలు, పంచాయతీ ఆస్తులు తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. తద్వారా రానున్న రోజుల్లో ఆయా గ్రామ పంచాయతీ ప్రజలకు అసెస్మెంట్ నంబర్ వస్తుందని ఆయన వివరించారు. సమావేశంలో గ్రామవార్డు సచివాలయం జిల్లా నోడల్ బి.రామగోపాల్, ఎంపీడీఓ ఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రభుత్వ సేవలు అందించాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామ/వార్డు సచివాలయాల్లోని అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సేవలు ప్రజలకు అందివ్వాలని గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి బి.రామగోపాల్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయంలోని అన్ని శాఖల ఉద్యోగులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజలకు అందించే సేవల్లో తలెత్తుతున్న సమస్యల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవలందించడమే అంతిమ మార్గంగా భావించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు ..

గరుగుబిల్లి: సచివాలయాల పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేకాధికారి రామగోపాల్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఏఓ ఎస్.అర్జున్‌రావు పాల్గొన్నారు.

ఓ వైపు పచ్చదనం..

మరో వైపు ఆదాయం..



పాలకొండ మండలంలో పొలాల వద్ద కందకాలు తవ్వుతున్న వేతనదారులు



మండలంలోని అన్నవరం వద్ద తోటల పెంపకం పరిశీలిస్తున్న అధికారులు

- ఉపాధి హామీ పథకంలో న్యూస్ట్రాటజీ వర్క్స్
- నీటి కుంటలు, కందకాల పనులకు ప్రాధాన్యం
- హార్టికల్చర్ ద్వారా పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహకాలు
- ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

పాలకొండ రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ప్రస్తుతం న్యూస్ట్రాటజీ వర్క్స్ ప్రారంభించారు. ఇప్పటికే ఈ పనులకు మంచి ఆదరణ లభిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల ద్వారా మరికొన్ని పనులకు రైతుల నుంచి దరఖాస్తులు రావడంతో ఈ పనులను యంత్రాంగం ప్రోత్సహిస్తోంది. కేంద్ర ప్రభుత్వమే జాతీయ గ్రామీణ ఉపాధి పథకం(ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా రైతులను ప్రోత్సహించడమే కాకుండా వారికి పక్కాగా రెండు వందల రోజుల పని కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది. పచ్చదనాన్ని పెంపొందించటమే ప్రధాన లక్ష్యంగా న్యూస్ట్రాటజీ వర్క్స్ పేరుతో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి, గ్రామాల్లో అంచనాలు రూపొందించారు. అటు రైతులు, ఇటు వేతనదారులు దీర్ఘకాలికంగా లబ్ధి పొందడం.. అన్ని ప్రాంతాల్లో పచ్చదనం..పండ్లతోటల ద్వారా రైతులకు శాశ్వత ఫలసాయం అందివ్వడమే ధ్యేయంగా ఈ పనులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మూడేళ్లకు...

న్యూస్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్లతోటలు పెంచుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు కల్పించడం జరుగుతుంది. హార్టికల్చర్ ద్వారా 14 రకాల పండ్ల తోటల మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు ఇస్తారు. వీటిని పొలాల్లో నాటడంతో పాటు మూడేళ్ల పాటు వాటిని పెంచుకునేందుకు ఏడాదికి రూ.35 వేల వరకు నిధులను ఉపాధి పథకం ద్వారా అందిస్తారు. అనంతరం మొక్కల ఫలసాయం ఆయా రైతులే పొందవచ్చు.

పచ్చదనాన్ని పెంపొందించడమే..

పచ్చదనాన్ని విస్తరింపజేయడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త పనులను ప్రారంభించారు. రైతులు తమ పొలాల చుట్టూ, పొలాల గట్లు, పొలాల్లోని చెట్లు, మొక్కల చుట్టూ కందకాలు (ట్రెంచ్‌లు) ఏర్పాటుకు ఉపాధి పథకం ద్వారా నిధులు చెల్లిస్తున్నారు. ఒక్కో చోట ఈ పనుల ద్వారా రైతులకు అటు పొలాల వద్ద చెట్లు సంరక్షించుకునే అవకాశం లభించడంతో పాటు రూ.17 వేల వరకు వేతనం కూడా లభించే అవకాశం ఉంది. మరోవైపు ఈ కందకాల కారణంగా చెట్టుకు నీటి సదుపాయం లభిస్తుంది. పొలాల్లో నీటి కాలువలు ఏర్పడతాయి. ఒక పొలం నుంచి మరో పొలానికి చీడపీడలు విస్తరించవు. ఎకరా నుంచి మూడెకరాల వరకు మెట్టు పొలాలున్న రైతులు నీటి కుంటలు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు రెండు మీటర్ల లోతు మేర వీటిని తవ్వుకోవాల్సి ఉంటుంది. వీటికి రూ.50 వేల వరకు చెల్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇప్పటివరకు 282 దరఖాస్తులు

న్యూస్ట్రాటజీ వర్క్స్‌కు పంచాయతీల్లోని ఉపాధి క్షేత్రసహాయకులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో ఒక్కో మండలానికి రెండు వందల పనులు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ క్రమంలో పాలకొండ, వీరఘట్టం, భామిని, సీతంపేట మండలాల నుంచి మొత్తం 512 దరఖాస్తులు వచ్చాయి.

రైతులకు ఎంతో మేలు ..



న్యూస్ట్రాటజీ వర్క్స్‌లో భాగంగా పండ్లతోటలు, టేకు మొక్కలు పెంచుకునేందుకు అవకాశం ఉంది. వీటి సాగును దృష్టిలో పెట్టుకుని పొలాల్లో కందకాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నాం. ఈ పథకం ద్వారా ఓవైపు రైతులకు, మరోవైపు ఉపాధి వేతనదారులకు మేలు చేకూరుతుంది. పచ్చదనం పెంపొందించే క్రమంలో రైతులు ముందుకు వచ్చి ఈ అవకాశం వినియోగించుకోవాలి.

ఎం.ఈశ్వరమ్మ, ఉపాధి ఏపీఓ, పాలకొండ

ధాన్యలక్ష్మీ నమోస్తుతే...



తమ ఆరుగాలం కష్టం ధాన్యలక్ష్మి రూపంలో ఫలించాలని రైతులు లక్ష్మీదేవికి పూజలు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా వరి కోతలు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా వరి పొలాల్లో ధాన్యం కంకులు పసుపుపచ్చని వర్ణంతో పుడమితల్లికి అలంకరించిన బంగారు ఆభరణాలుగా దర్శనమిస్తున్నాయి. పాలకొండ మండలంలో ఎకరాకు దాదాపు 33 నుంచి 35 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉండడంతో అన్నదాతలు ధాన్యలక్ష్మీ నమోస్తుతే అంటూ ప్రణమిల్లుతున్నారు.

– పాలకొండ రూరల్

బ్యాంకు వివరాలను అపరిచితులతో పంచుకోవద్దు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ మరియు సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): బ్యాంకు వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని కురుపాం ఏఎస్‌ఐ నరసింహులు, హెచ్‌సీ అసరయ్య అన్నారు. కురుపాం గ్రామంలో గురువారం జరిగిన వారపు సంత ప్రదేశం వద్ద పరిసర గ్రామాల నుంచి వచ్చిన మహిళలకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాలు, రోడ్ సేఫ్టీ, బాల్యవివాహాల పట్ల అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ నుంచి వచ్చే ఓటీపీని చెప్పడం వలన బ్యాంకు ఖాతాలోని నగదును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా నమ్మిస్తుంటారని, అటువంటి వారి మాయమాటలకు లొంగకూడదన్నారు. మహిళల రక్షణ కల్పించేందుకు ఉన్న చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.

సమయం వృథా చేయరాదు..



మట్టి పిడతలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: విద్యార్థులు సమయం వృథా చేయకుండా పుస్తక పఠనంతో విజ్ఞానం పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం, శతక పద్య కంఠతా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం ప్రోత్సాహకాలను అందించారు. ప్రత్యేకించి పొదుపు మంత్రంపై అవగాహన కల్పిస్తూ మట్టి పిడతలు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు బౌరోతు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల సోదరభావంతో మెలగాలి



ఫిర్యాదుల పెట్టె ప్రారంభిస్తున్న సీఐ, ఎస్‌ఐ, తదితరులు

కొమరాడ: సమాజంలో మహిళలు పట్ల సోదరిభావంతో మెలగాలని పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో సంకల్పం కార్యక్రమంగో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. అనంతరం ఫిర్యాదుల పెట్టె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి, సారా తదితర చెడు అలవాట్లకు గురి కారాదన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్లలో యాప్ నిర్వహణ, సోషల్ మీడియా పట్ల అవగాహన కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ఎస్‌ఐ కె.నీలకంఠం, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆర్థిక సాయం..

పాలకొండ రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముంటూ ఇటీవల మరణించిన దర్జీలు కొత్తలంక నాగేశ్వరరావు, చిప్పాడ వెంకటరమణ కుటుంబాలను మాజీ కౌన్సిలర్ పల్లా కొండలరావు గురువారం పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులకు రూ.10వేల వంతున ఆర్థిక సాయం చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని నీలకంఠాపురం పోలీస్‌లీస్‌లీస్‌స్టేషన్ పరిధిలోని వనలగూడ గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారాతో ఓ వ్యక్తి పట్టుబడ్డాడని ఎస్‌ఐ నీలకంఠారావు తెలిపారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఎవరైనా సారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సింగన్నవలసలో పశు వైద్యసేవలు

పాలకొండ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సంచార పశువైద్య వాహనాల సేవలు పాడి రైతులకు ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో అంబులెన్స్‌ల ద్వారా పశువులకు వైద్యం అందిస్తున్నారు. మండలంలోని సింగన్నవలసలో పశువైద్యవాహనం సిబ్బంది గురువారం పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామవెటర్నీరీ అసిస్టెంట లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐతో అనుసంధానం తప్పనిసరి

వీరఘట్టం: ఉపాధి హామీ పథకంలో ఉన్న వేతనదారులందరూ తపాలా శాఖ ద్వారా ప్రభుత్వ ఫలాలు పొందాలంటే అందరి ఖాతాలకు ఎన్‌పీసీఐతో లింక్ చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో తపాలా శాఖ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సమావేశంలో ఏపీఓ జి.సత్యంనాయుడు, ఏపీఎం రాము, సబ్ పోస్టుమాస్టర్ ఎస్.కృష్ణ, పోస్ట్‌మన్ టి.రవిబాబు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

గరుగుబిల్లి: ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పని చేసిన వారికే సమాజంలో గుర్తింపు ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. తోటపల్లి పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహించి ఉల్లిభద్ర పంచాయతీకి బదిలీపై వెళ్లిన శ్రీనివాసరావుకు తోటపల్లి సచివాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, కన్నయ్య, పకీరు నాయుడు, వాసుదేవరావు పాల్గొన్నారు.

మార్మోగిన సాయినామ స్మరణ

వీరఘట్టం: సత్యసాయి 99 జన్మదిన వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున నగర సంకీర్తన చేపట్టడంతో సాయి నామస్మరణ మర్మోగింది. సాయంత్రం వీరఘట్టం ప్రధాన రహదారిలో సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు చేపట్టిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పల్లా నేతాజీనాయుడు, కిల్లారి సన్యాసినాయుడు, గెంబలి మురళీ, అల్లం కృష్ణ, వద్దాది సావిత్రమ్మ, కందుల లక్ష్మి, గేదెల గణపతిరావు, వూణ్ణ శ్రీను, అల్లాడ వెంకటరావు, చిన్నారి గురునాథం, కిల్లారి కొండమ్మ పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వీరఘట్టం మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావుకు గురువారం పితృ వియోగం కలిగింది. ఈయన తండ్రి అచ్చెంనాయుడు (72) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఇంటి వద్దే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గ్రామానికి చేరుకుని లక్ష్మణరావును అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి గోవిందరావు, పరిసినాయుడు తదితరులున్నారు.

పక్కాగా ఇంటింట సర్వే..

భామిని: ఇంటింట సర్వే పేరిట చేపడుతున్న హౌస్ హోల్డ్ సర్వే పక్కాగా ఉండాలని ఎంపీడీఓ గుండేలా చంద్రరావు అన్నారు. మండలంలోని చిన్నదిమిలి సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన సర్వేపై ఆరా తీశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శంకరరావు, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో ఆర్థిక పరిపుష్టి

పాలకొండ రూరల్: వాణిజ్య పంటల్లో భాగంగా పామాయిల్ సాగుతో రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మండలంలోని యరకారాయపురంలో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆసక్తిగల రైతులకు శాఖాపరంగా రాయితీలు అందిస్తామన్నారు.

26న రైతు, కార్మికుల ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న పార్వతీపురంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు రైతు, కార్మిక వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తోట జీవన్న, గరుగుబిల్లి సూరయ్య తెలిపారు. కురుపాం మండల కేంద్రంలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను కార్మికులతో కలిసి గురువారం విడుదల చేశారు.

వట్టిగెడ్డ పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ పనులను రిటైర్డు చీఫ్ ఇంజనీరు, జైకా టెక్నికల్ కన్సల్టెంట్ షేక్ సాఫ్‌జాన్ గురువారం పరిశీలించారు. వట్టిగెడ్డ ఆధునికీకరణ పనులకు రూ.44.85 కోట్లు అంచనాతో రూ.39 కోట్లతో పనులు ప్రారంభించిన విషయం విదితమే. ఇంతవరకు జరిగిన పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు. రిజర్వాయరులో నీరు తగ్గుముఖం పట్టడంతో పనులు చేయడానికి మంచి అవకాశమన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు జనవరి నుంచి పనులు ప్రారంభిస్తామని తెలపగా ఇప్పటి నుంచే పనులకు సంబంధించిన సామగ్రి సిద్ధం చేస్తే జనవరిలో పనులు చేయడానికి అవకాశముందన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు బొబ్బిలి ఎస్ఈ సుగుణాకరరావు, ఈఈ ఆర్.అప్పలనాయుడు, మోహనరావు, ఏఈ జీవీ రఘు, ఏజెన్సీ ప్రాజెక్ట్ మేనేజర్ పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

గరుగుబిల్లి: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని డీఈఓ నల్ల తిరుపతినాయుడు అన్నారు. మండలంలోని పెదగొడబ పంచాయతీ సన్యాసిరాజుపేటలోని పాఠశాలను ప్రార్థన సమయంలో గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థి దశ నుండే పాఠ్యాంశాల్లోని అంశాలతో పాటు నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రత్యేక కథనాలను వివరించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో బడితోట ప్రాముఖ్యతను వివరిస్తూ వాటిని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసి ఆకు కూరలు, కాయగూరలను మధ్యాహ్న భోజనంలో వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఎంఈఓ దత్తి అప్పలనాయుడు తదితరులున్నారు.

వీడీవీకేలను బలోపేతం చేయాలి

సీతంపేట: వీడీవీకేలను బలోపేతం చేయాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుంచి వెలుగు ఏపీఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ఉత్పత్తుల తయారీ పెంచాలని సూచించారు. ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అలాగే స్త్రీనిధి రుణాల రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఏపీడీ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

భామిని: మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరా రు. సంఘ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీపతినాయుడుతో కలసి గురవుఆరం ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడానికి అన్ని సదుపాయలు ఉన్నాయని చెప్పా రు. మండల రైతులు పత్తిని విక్రయించేందుకు సుమారు 140 కిలోమీటర్ల దూరంలోని రామభద్రపురం వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు, నాయకులు స్పందించి మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొళ్ళ నాగరాజు, గురుగుబిల్లి సుబ్బినాయుడు, బిడ్డిక విష్ణు, బిడ్డిక కాంతారావు, బడితిమాను తౌడు, తదితరులు పాల్గొన్నారు.

‘నిందితులను కఠినంగా శిక్షించాలి’

కొమరాడ: ప్రేమ పేరుతో విశాఖలో న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళ సంఘం జిల్లా కన్వీనర్ వాకాడ ఇందిర డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు, స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రోజూ మహిళలు, పిల్లలపై నేరాలు, అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయన్నారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన ..



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: రహదారి ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఎస్సై వై.అమ్మన్నరావు గురువారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులకు పలు విషయాలపై సూచనలు చేశారు. అలాగే సైబర్‌నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోనుబాయి ఆశ్రమ పాఠశాల సందర్శన



వంటకాలు పరిశీలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న మెనూ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పదో తరగతిలో శతశాతం ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

పాలకొండ: నగర పంచాయతీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ ఎంఎస్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఇరవై ఏళ్లుగా పాలకొండ నగర పంచాయతీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బందికి పారిశుధ్య కార్మికుల కంటే వేతనాలు తక్కువగా అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధమైన వారి హక్కులు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వై. హరిబాబు, ఉమామహేశ్వరరావు, టి. ఈశ్వరరావు, పి. సతీష్, పి. వేణు, సీహెచ్ సంజీవి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు తరలింపు



నేత్ర శస్త్ర చికిత్స కోసం ఎంపికైన రోగులు

కొమరాడ: స్థానిక పీహెచ్‌సీ కేంద్రం పరిధిలోని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించామని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం కొమరాడ నుంచి శస్త్రచికిత్స కోసం ఎంపికైన నేత్ర రోగులను విజయనగరంలోని పుష్పగిరి ఆస్పత్రికి గురువారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 20 రోజులుగా పరీక్షలు నిర్వహించిన వారికి కేటరాక్ట్, టేరిజియం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. కంటి వైద్య సహాయకులు రమేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆదాయం



చేపలను చెరువులో విడిచిపెడుతున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: చేపల పెంపకంతో మెరుగైన ఆదాయం సమకూర్చుకోవచ్చని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని నౌగూడ గ్రామంలో నాబార్డు ఆధ్వర్యంలో పెంపకందారులకు గురువారం చేపపిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేప పిల్లల పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నాటుకోళ్ల పెంపకం యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నాబార్డు డీపీఎం దినేష్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.